telugurekhamedia.com
TELUGU REKHA TELUGU DAILY
# తెలుగు రేఖ
సంపుటి : 02 సంచిక : 44 పేజీలు : 4 వెల : రూ. 2.00
తెలుగు దినపత్రిక
మంగళవారం 12 మే 2026 తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ RNI No.TELTEL/2010/31853

## 13న పాలిటెక్నిక్ ప్రవేశ దీక్ష

### పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్,మే11 తెలుగురేఖ:**
రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకుఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

## రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మే 11 **తెలుగురేఖ:** జూన్ 12 న పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించే సభకు గవర్నర్ ను ఆహ్వానించిన ముఖ్యమంత్రి. విద్యార్థులు పొగాకు, మద్యం ,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, బాధ్యతగల పౌరులుగా ప్రవర్తించాలని సభ లో సామూహిక ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి గతంలో సూచించిన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా. గవర్నర్ సూచన ను గౌరవిస్తు విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించనున్న ప్రభుత్వం..

# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

- రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకువెళతామని మోడీ అన్నారు
- రాష్ట్ర ప్రాజెక్టుకు అనుమతులను మాత్రమే కోరాం
- రాష్ట్రప్రయోజనాల కోసమే నా పోరాటం
- బిజెపిని ఓడించి సిఎం అయిన వ్యక్తిని నేను
- బిజెపి అంటే..బ్రిటిష్ జనతా పార్టీ
- విభజించు పాలించడం బిజెపి రాజకీయం
- సర్ పేరుతో రాష్ట్రాల్లో చొరబడే యత్నం
- జెమిని సర్కస్‌లా బిజెపి ఎన్నికల విధానం
- మోడీ పాలానానుభవ రాహిత్యంతో దేశానికి నష్టం
- మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మే11 తెలుగురేఖ:**
రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్‌ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్‌ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి 2 లో..

## కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

- వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యావేక్షిస్తున్నా
- 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,మే 11 తెలుగురేఖ:**
ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల 2 లో..



## రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు కృషి

- పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ఆస్తకి
- పరిశ్రమల శాఖ అధికారులతో సిఎస్ సమీక్ష



**హైదరాబాద్,మే 11 తెలుగురేఖ:**
తెలంగాణ రైజింగ్ -2047 విజన్ లో భాగంగా రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమలశాఖ అధికారులతో, ప్రాజెక్ట్ కన్‌స్టలెంట్లతో 3 లో..

## బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్

- తక్షణ విచారణకు డిజిపిని ఆదేశించిన రేవంత్,
- సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు



**హైదరాబాద్,మే11 తెలుగురేఖ:**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి 2 లో..

## టీజీ ఇఏపీసిఈటి పరీక్షలు విజయవంతం

### ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణా రెడ్డి



**హైదరాబాద్ తెలుగురేఖ:**
రాష్ట్ర ఉన్నత విద్యా మండలి టీజీ సిహెచ్‌ఇ తరపున జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం నిర్వహిస్తున్న, టీజీ ఇఏపీసి ఈటి ఈఏడాది ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు విజయ వంతంగా కొనసాగు 2 లో..

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ
- మరో సహభ్యురాలుగా చాకలి ఐలమ్మ మనవరాలు



**హైదరాబాద్,మే11 తెలుగురేఖ:**
తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, 2 లో..




## మోదీ తెలంగాణలో ఎన్ని సార్లు తిరిగిన అధికారం కల్ల

- తెలంగాణలో బీజేపీ మొలకెత్తదు.
- మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే.
- నరేంద్ర మోదీ పర్యటన పై టీపీసీసీ చీఫ్ ఘాటు వ్యాఖ్యలు.

2 లో..

**నిజామాబాద్ మే11 తెలుగురేఖ:**
నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నిసార్లు తిరిగిన ఆ పార్టీ అధికారంలోకి కల్ల అని ప్రదేశ్ కాంగ్రెస్



## కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

- కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి

**హైదరాబాద్,మే 11 తెలుగురేఖ:**
కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ 3 లో..

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

- రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు,
- కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు



**వరంగల్,మే11 తెలుగురేఖ:**
లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని శాసనసభ 2 లో..

## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

- ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం
- ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ,మే11 తెలుగురేఖ:**
కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం 2 లో..

## పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

- సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో లోకేశ్ భేటీ




**అమరావతి,మే11 తెలుగురేఖ:**
సింగపూర్‌లోని పుంగోల్ తరహాలో అమరావతిలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్.. దేశానికే మోడల్‌గా నిలుస్తుందని 2 లో..

## గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

- పోలవరం పెండింగ్ అంశాలను పరిష్కరించండి,
- తొలిదశ నిర్మాణాలను పూర్తి చేయడానికి సహకరించండి,
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌ను కోరిన సిఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ,మే11 తెలుగురేఖ:**
పోలవరం ప్రాజెక్టులో కీలకమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. 2027 గోదావరి పుష్కరాల్లోపు ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అలాగే, పలువురు కేంద్రమంత్రులను కలిసి ఏపీకి సంబంధించిన అభివృద్ధి పనులపై 2 లో..




## పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక




- పశ్చిమాసియా యుద్ధంతో సంక్షోభ పరిస్థితులు
- ప్రధాని మోడీ మిషన్ దేశానికి అవసరం
- అందరం కూడా దానిని అనుసరిస్తే మంచిది
- సవాళ్లను అధిగమించే సమయం ఇదే
- సిఐఐ సదస్సులో ఏపి సిఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ,మే11 తెలుగురేఖ:**
పారిశ్రామిక పురోగతిలో సీఐఐది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం పారిశ్రామికంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలతో లక్ష్యాలు చేరుకోవచ్చని వివరించారు. 1990 నాటి ఆర్థిక సంస్కరణల ఫలితాలను ఇప్పుడు చూస్తున్నామని చెప్పుకొచ్చారు. 2 లో..

# గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం చేసిన శివాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.

# మోదీ తెలంగాణలో ఎన్ని సార్లు తిరిగిన అధికారం కల్ల

కమిటీ అధ్యక్షులు , ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్లో సెక్యులర్ భావాలు కలిగిన వారి ఓట్లు తొలగించి అడ్డదారిలో అధికారంలోకి వచ్చారని , కానీ తెలంగాణ ప్రజలు సౌమ్యులు అని అయినా అన్నారు. తెలంగాణలో నరేంద్ర మోదీ పాచికలు పారవని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఈ రాష్ట్ర ప్రజలు ఆదరిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పునరుద్ఘాటించారు. నరేంద్ర మోదీ పర్యటన పూర్తిగా రాజకీయ కోణంలో జరిగిందని, దేశ ప్రధానిగా మాట్లాడలేదని ఆయన ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. బెంగాల్ రాష్ట్రంలో 92 లక్షల సెక్యులర్ ఓట్లను తొలగించి అధికారంలోకి వచ్చారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. 2028 –29 లలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజార్టీతో మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్ పార్టీ రెండు ఒకటేనన్న ప్రచారం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ఆయన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న రాద్ధాంతం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు ఎంతో గోస పడ్డారని, వరి వేస్తే ఉరేనని ప్రచారం చేసిన ఆ పార్టీ నేతలు రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో తాహేర్ బిన్ హందాన్ , నగేష్ రెడ్డి, జావీద్ అక్రమ్, విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుంగోల్ తరహాలో అమరావతిలో టౌన్‌షిప్

ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా అక్కడి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జేఐఎస్‌సీ మద్దతుతో అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ఎకనామిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రాజధాని అమరావతికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సింగపూర్ ద్వారా ఆగ్నేయ ఆసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కోరారు. సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తామని లోకేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, సింగపూర్ ప్రభుత్వాల మధ్య ఇప్పుడు పటిష్ఠ భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. ఎంవోయూలోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు ఇటీవల సింగపూర్‌లో వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారని గుర్తుచేశారు.

# మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు ఛైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

# టీజీ ఇఏపీసెట్ పరీక్షలు విజయవంతం

తున్నాయి అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు, ఈసందర్భంగా మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగ పరీక్షలు రెండు సెషన్లలో ప్రశాంతంగా జరిగాయి అని, ఉదయం సెషన్‌లో 35,230మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 33,314మంది హాజరై 94.56శాతం హాజరు నమోదైంది, మధ్యాహ్నం సెషన్‌లో 35,295 మంది నమోదు చేసుకోగా 33,099 మంది హాజరై 93.78శాతం హాజరు నమోదైంది, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు ఎటువంటి అంతరాయాలు లేకుండా సజావుగా కొనసాగు తున్నాయని తెలిపారు. వ్యవసాయ, ఫార్మసీ మరియు ఇంజినీరింగ్ విభాగాల్లో మొత్తం హాజరు శాతం 92నుంచి 94శాతం మధ్య నమోదైందన్నారు, పరీక్షల నిర్వహణను తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి, జేఎన్ టిహెచ్ యు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషెన్ కుమార్ రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ కె.విజయ కుమార్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగల మని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభ మైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సమీక్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమూల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశు ద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. 'విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. 'టీచర్లకు ఇది కేవలం ఉద్యోగం కాదు.. అదొక బాధ్యత. 19 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు. తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు. ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభాకర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైకుల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యూరియా కేంద్రం ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వం పంచాలని తెలిపారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# పారిశ్రామిక ప్రగతిలో సిఐఐది కీలక భూమిక

సోమవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ సుస్థిరమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలని మోదీ సూచించారని అన్నారు. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కొన్ని అంశాలతో ప్రధాని మోదీ జాతీయ మిషన్‌ను ప్రకటించారు. ప్రధాని మిషన్‌ను అందరూ ముందుకు తీసుకెళ్లాలి. ఇది ప్రధాని టాస్క్ మాత్రమే కాదు, మనందరిది. సంక్షోభం నుంచి వచ్చిన సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలి. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రపంచంపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తీవ్రంగా ఉందని వెల్లడించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడకుండా కేంద్ర ప్రభుత్వం చూసిందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు.. క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోందని వివరించారు. వికసిత్ భారత్ దిశగా ముందుకెళ్తున్నామని చెప్పుకొచ్చారు. భారత ఆర్థికవృద్ధి వేగంగా కదులుతోందని అన్నారు. పెట్టుబడులకు స్వర్గధామం ఆంధ్రప్రదేశ్ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత పరిశ్రమల ప్రోత్సాహానికి సీఐఐ సరైన వేదిక అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక పురోగతిలో సీఐఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రభుత్వాలు ఎకో సిస్టమ్‌ను మాత్రమే సృష్టిస్తాయని, ఇన్నోవేటర్లు, పారిశ్రామికవేత్తలు దీర్ఘకాల ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తారని తెలిపారు. తనకు జాతీయ, రాష్ట్ర అజెండాలున్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు ప్రోత్సహిస్తారన్న నమ్మకం ఉందన్నారు. 1990 సంస్కరణల మాదిరిగా భారత్ మరో మైలురాయి ముంగిట ఉంది. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, క్లీన్ ఎనర్జీ యుగం నడుస్తోంది. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు తదుపరి గ్లోబల్ ఎకనమిక్ ఆర్డర్‌ను నిర్ధరిస్తాయి. ఆర్థిక సంస్కరణల వల్ల మనందరికీ సృజనాత్మకతతో వైవిధ్యంగా ఆలోచించే అవకాశం వచ్చింది. ఆర్థిక సంస్కరణలకు ముందు, తర్వాత ఎందరో ప్రధానులను చూశా. సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ నేతృత్వం ఉండటం మన అదృష్టం. దేశంలో స్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. భారత్ అన్‌స్టాపబుల్‌గా సాగుతోంది. గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని చంద్రబాబు తెలిపారు.

# గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేయండి

ముఖ్యమంత్రి చర్చించారు. ఈ క్రమంలోనే సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. తొలిదశలో 41.15 మీటర్ల మేర నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే తాను స్వయంగా ఐదుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షించి నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2026 ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రామ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యిందని, గ్యాప్ 1, గ్యాప్ 2లలో కీలకమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగు తున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్ లో ఉందనే కారణంతో 2011లో ఇచ్చిన స్టాప్ వర్క్ ఆర్డర్ ఉత్తర్వు లను శాశ్వతంగా ఉపసంహరించు కోవాలని కేంద్ర జలశక్తి మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. దీనివల్ల పోలవరం ప్రాజె క్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా చేపట్టేం దుకు వీలవుతుందని స్పష్టం చేశారు. సాగునీటి అవసరాల దృష్ట్యా మొదట నిర్ణయించిన దానికంటే కుడి, ఎడమ కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినట్లు వివరించారు. ప్రస్తుతం కుడి కాలువ 95 శాతం మేర.. ఎడమ కాలువ పనులు 78 శాతం మేర పూర్తి అయ్యాయని తెలిపారు. కాలువల సామర్థ్యం పెంచిన మేరకు నిధులను రీయింబర్స్ చేయాలని జల శక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు తదుపరి పనులకు సంబంధించి అవసరమైన నిధులను కూడా మంజూరు చేయాలని కేంద్రమంత్రిని సీఎం చంద్రబాబు కోరారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కృషి సించాయి యోజన కింద ఏపీలోని వివిధ పథకాల పునరుద్ధరణ, ఆధునికీకరణకు నిధులు మంజూ రు కోరుతూ లేఖ ఇచ్చారు. హర్ ఖేత్ కో పానీ కార్యక్రమంలో భాగంగా చెరువులు, కుంటల మరమ్మతులు, పునరుద్ధరణ ,ఆధునికీకరణ, కాలువల పూడిక తీత, గట్ల బలోపేతం లాంటి పనులు చేయాల్సి ఉందన్నారు. ఏపీ వ్యాప్తంగా 297 నీటి వనరు ల పునరుద్ధరణ కోసం రూ.285 కోట్ల నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై గెజిట్ నోటిఫి కేషన్ విడుదల చేయొద్దని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆనకట్ట ఎత్తును 519.60 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచితే ఏపీ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని.. ఎలాంటి సాంకేతిక, పాలనా పరమైన అనుమ తులు మంజూరు చేయొద్దని సీఎం చంద్రబాబు సూచించారు. అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్ ఫేజ్-ఎఎఎ కింద భూసేకరణ ఇతర సన్నాహక పనులు చేయకుండా కర్ణాటకను ఆదేశించాలని, సుప్రీంకోర్టు తుది తీర్పు వచ్చేంత వరకూ యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల దాహార్తిని తీర్చే పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. గోదావరి నుంచి సముద్రంలోకి వృథాగా పోయే 200 టీఎంసీల వరద జలాలను మళ్లించేలా పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించారు. వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏపీ నీటి అవసరాలకు అనుగుణంగా 8 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కుడివైపున హెడ్ స్లూయిస్ నిర్మాణం చేపడతామని తెలిపారు. దీనికి అవసరమైన భూసేకరణ కోసం ఒడిశాను ఆదేశించాల్సిందిగా జలశక్తి శాఖ మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్

మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది. ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసులు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన కేసు కావడంతో చట్టపరమైన ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా అమలు చేస్తున్నారు.

# సంపాదకీయం..

## రాజకీయ పార్టీల్లో సర్ భయాలు !

సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే సర్ ప్రక్రియ మొదుల కానుంది. దీంతో ఓటర్ల ఏరివేత చేపడతారు. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ సాగింది. ఇప్పుడు ఎపి, తెలంగాణలో సాగనుంది. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశాయి. బూత్ లెవల్లో అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించాయి. దీనినిబట్టి వీరి ఆందోళన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. నిజంగానే అవసరమే. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట్రాల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న.సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీలు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్‌లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిష్యత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉన్నప్పుడు. కూడా తొలగించడం సరైన చర్యనే. ఉమ్మడి ఎపిలో ఆంధ్రావాళ్లవి తెలంగాణలో కూడా ఓట్లు ఉండేవి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఇటీవల ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. ఇందులో బంగ్లా నుంచి దొంగచాటుగా వచ్చిన వారే 90శాతం మంది ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్‌ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చు. ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాగలిగితే ఇక పంచాయితీయే ఉండదు. ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. ప్రజాస్వామ్య పక్రియను పూర్తిగా పటిష్టం చేయగలుగుతాం. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి అధునాతన ఆలోచనలకు పూనుకోవాలి. అప్పుడు ప్రక్షాళనతో పిలేకుండా మరణించిన వారి పేర్లను తొలగించటం సులభం కాగలదు. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒకే ఓటు కలిగి ఉండేలా పక్కాగా ఓటరు కార్డును రూపొందించాలి. ఓటుకు పక్కాగా ఆధ్యార్ తరహాలో నంబర్ కేటాయించాలి. ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన రాజకీయ పార్టీల్లోనే లేదు. అందువల్ల ముందుగా పక్కాగా ఓటు నమోదు జరగాలి. దానికి పక్కాగా కార్డు ఉండాలి. నంబరుతో కూడిన ఆధార్, పాన్ తరహా కార్డులను జారీచేయాలి. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయ.

### కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

### రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు కృషి

సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమలశాఖపై ఆయన సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ రాష్ట్రాల పారిశ్రామికవేత్తలు ఆస్తకి చూపుతున్నారని, ఆ దిశలో పరిశ్రమలశాఖ అధికార యంత్రాంగం సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని, తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొని పారిశ్రామికవేత్తలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎం.ఒ.యు.లతోపాటు పెట్టుబడి దారులకు అవసరమైన ఇతర మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాలతోపాటు ఆయా రంగాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా పెట్టుబడుదారులకు తెలియపరిచి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాలని సిఎస్ తెలిపారు. భారీ పెట్టుబడులతో పాటు స్థానిక యువతకు అధిక స్థాయిలో ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫార్మా రంగం, చేనేత ఉత్పత్తులు, టెక్స్ టైల్ పార్కులు, ఐటి పరిశ్రమలు, డేటా సెంటర్లు, డ్రైపోర్టులు సంబంధిత రంగాల్లో పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ కు వారు ఆకర్షితులవుతున్నందున అధికార యంత్రాంగం కూడా తగు కార్యాచరణ ప్రణాళికతో వారిని ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తదితర ఐటి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారని అధికారులు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, డెయిరీ ఉత్పత్తుల రంగంలో కూడా పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ రంగాలలో పెట్టుబడులతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీలో మెగా జాబ్ మేళా




**హన్మకొండ, మే11, తెలుగు రేఖా:**
ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక అభివృద్ధి 99రోజుల్లో భాగంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఉపాధి అవకాశాల కల్పనకు మరో ముందడుగు పడింది. మే12 నిర్వహించనున్న మెగా జాబ్ డ్రైవ్ పోస్టర్‌ను కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే.యూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా అందించేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తోందన్నారు. మెగా జాబ్ డ్రైవ్ ద్వారా వివిధ ప్రముఖ కంపెనీలు (24/7 జాబ్స్ కంపెనీ, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీ,బజాజ్ ఫైనాన్స్ కంపెనీ, క్యూన్ కార్పొరేషన్ క్లైంట్స్) కంపెనీలు ఇవే కాకుండా దాదాపు 12 కంపెనీలు పాల్గొంటున్నాయి కాబట్టి నిరుద్యోగ యువకులు,ఏదైనా డిగ్రీ,బీటెక్ పూర్తి చేసిన వాళ్ళు జాబ్ మేళాను విద్యార్థులు,యువకులు ఈ సదా అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.మంగళవారం ఉదయం 10:00 గంటలకు కే.యూ క్యాంపస్ లో కామర్స్ సెమినార్ హాల్లో నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్ ను విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహ చారి, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆచార్య ఇస్తారు ,యూనివర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా,,మమత ,మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి ఎల్ రాకేష్, పి.నందీశ్వర, శ్రీనివాస్, డా,,నాగరాజు తదితరులు ఈ పోస్టర్ ఆవిష్కరణ లో పాల్గొన్నారు.

## ఎలుకుర్తి లో వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



**ధర్మసాగర్ మండలం. మే 11.తెలుగు రేఖ.**
హనుమాన్ జయంతి ఉత్సవం పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, గ్రామములో శివాలయము హనుమాన్ దేవాలయంలో ఉదయం స్వామివారికి పల్లకి సేవతో గిరి ప్రదక్షణ తో ఆంజనేయ స్వామికి విశేష అభిషేకాలు అర్చనలు చందనము పూజలు చేయడం జరిగింది . తదనంతరం ఆంజనేయ స్వాములకు ఇరుముడి కార్యక్రమం చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు హనుమాన్ భక్తులు హోమము కార్యక్రమం చేపట్టారు ఇరుముడి కట్టుకొని శ్రీరామ జయ రామ జయ జయ రామ అనే నామాన్ని, జై జై హనుమా, పవన సుత హనుమా అని ఆంజనేయుని భక్తి పాటలు పాడుతూ చిందులు వేస్తూ భజన కార్యక్రమం చేపట్టారు గుడి పూజారి కో లనుపాక మహేష్, పానుగంటి వినయ్ వీరి ఆధ్వర్యంలో హోమము విజయవంతంగా జరిగింది . అలాగే ఎలుకుర్తి గ్రామంలో మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఇటి కార్యక్రమంలో నర్సింగరావు పల్లి భక్తులు, రామన్నగూడెం భక్తులు, తదితర గ్రామాలను నుండి తరలివచ్చి హనుమాన్ జన్మ ఉత్సవ్ సందర్భంగా మహా అన్నదాన ప్రసాదాలు స్వీకరించారు ఇట్టి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు .

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

### నేడు నియామక పత్రాలు అందించనున్న మంత్రి దామోదర



**హైదరాబాద్,మే11 తెలుగురేఖ:**
ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగలశారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక పక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించనున్నారు. ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తరించేందుకు కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయోగపడనున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యరంగంలో వారి పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలందిస్తున్నారని, వారి సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## రాష్ట్రానికి వచి సుద్దులు చెప్పిన ప్రధాని

- అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మాటలెందుకు
- ప్రధాని పర్యటనపై మంత్రి పొన్నం వ్యాఖ్యలు



**హైదరాబాద్,మే 11( తెలుగురేఖ):**
ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్‌ఆర్‌ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## మోర్తాడ్‌లో రైతుల రహదారి ధర్నా

- ధాన్యం కొనుగోళ్లు,తరుగుదోపిడీపై నిరసనలు
- అధికారులు స్పందించడం లేదన్న మాజీమంత్రి వేముల

**నిజామాబాద్,మే11( తెలుగురేఖ):**
ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలని, తరుగు దోపిడీని అరికట్టాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు, మంత్రులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దొడ్డు రకం ధాన్యానికి గ్రేడ్ వన్ ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కల్లాల్లో ధాన్యాన్ని తరలించేందుకు లారీల కొరన్న తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.వడ్ల కొనుగోళ్ల పక్రియ నత్తనడకన సాగుతున్నదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పంటను అమ్ముకోవడానికి రైతులు నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. మూడు రోజులుగా పలు కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించానని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడానికి రైతు నిరసన, ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేస్తామని ప్రకటించి కేంద్రాలు తెరిచే సరికి 15 రోజులు, గన్నీ బ్యాగులు వచ్చేసరికి వారం, కాంటా పెట్టేసరికి మరో వారం అన్నట్లుగా 20 రోజుల పాటు కావాలనే జాప్యం చేసిందని ఆరోపించారు. మద్దతు ధర రూ.2,390 ఉండగా ప్రభుత్వ జాప్యం భరించలేక రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యక్తులకు రూ.1,750 నుంచి రూ. 1900లకే అమ్ముకుంటున్నారని, దీంతో ఎకరాకు సుమారు రూ.15వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వాన్ని శాసిస్తున్నారని, తరుగు పేరుతో 40 కిలోలకు 5 కిలోల అదనపు వడ్లు (క్వింటాలుకు 12.5 కిలోలు) దోచుకుంటున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలో ఇది కేవలం 1.5 కిలోలు మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. ల్గ÷తుల సమస్యలపై మాట్లాడేందుకు కలెక్టర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదని, కనీసం స్పందించే తీరిక కూడా లేదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ పాలసీలో భాగమేనని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, రవాణాకు లారీలను పెంచాలని, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలని, తరుగును తగ్గించి, పాత పద్ధతిలోనే వడ్లు సేకరించాలని, దొడ్డు రకానికి గ్రేడ్ -1 రేటుతో పాటు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి రైతులకు న్యాయం చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు.నియోజకవర్గంలోని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోల్తి. కిరణ్ గౌడ్



**వరంగల్, మే11 , తెలుగు రేఖా:**
వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలం 17 డివిజన్లోని బోల్లికుంట గ్రామంలో కూనూరు శ్రీనివాస్( ఇల్లందల బిక్షపతి) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా సోల్తి.కిరణ్ గౌడ్ వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని మృతుని కుటుంబానికి మరియమ్మ మరియు ఆయన కుమార్తెలకు 5000/ రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసునూరి రమేష్ , పసునూరి ప్రభాకర్, జున్న నాగరాజు , కల్వల శ్రీనివాస్ , పసునూరి సతీష్ , సదువాలా యాకూబ్ మొదలగువారు పాల్గొన్నారు.

## సాంకతిక దినోత్సవం సందర్భంగా సిఎం శుభాకాంక్షలు

**హైదరాబాద్,మే11 తెలుగురేఖ:**
జాతీయ సాంకేతి దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తుందని సీఎం తెలిపారు. 'ప్రగతికి దారి చూపుతూ, భవిష్యత్తు తరాలకు ప్రేరణనిస్తున్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు, ఆవిష్కర్తలందరికీ 'జాతీయ సాంకేతిక దినోత్సవం' సందర్భంగా శుభాకాంక్షలు. సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, భవిష్యత్ సవాళ్లను అధిగమించడం కోసం టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతునిస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని భారత టెక్నాలజీ శక్తిని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు' సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## మౌళిక వసతులపై పస్రత్యేక దృష్టి

- హ్యామ్ రోడ్లపై నేడోరేపో సిఎంత్ చర్చలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మే 11( తెలుగురేఖ):**
నాణ్యమైన మౌలిక వసతుల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పుకొచ్చారు. మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా హ్యామ్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. హ్యామ్ తుది అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం లేదా బుధవారం కలిసి చర్చిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హ్యామ్ ప్రాజెక్ట్ పురోగతిపై సోమవారం సచివాలయంలో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. హ్యామ్ ప్రాజెక్ట్ టెండర్ పక్రియపై అధికారులను ఆరా తీశారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్ఏఐ, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న హ్యామ్ మోడల్ వివరాలు మంత్రికి వివరించారు అధికారులు. బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేల నుంచి రూ.89 వేలకు పెరిగిందని తెలిపారు. బిటుమెన్ ధరల్లో దాదాపు వందశాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు. జీఎస్టీ అదనపు భారం, ఇతర మెయింటెనెన్స్, పశ్చిమాసియ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెరగడానికి కూడా ఓ కారణమని అధికారులు పేర్కొన్నారు. గుజరాత్‌లో 66శాతం, మహారాష్ట్రలో 47శాతం ధరలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ధరలు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. ÷ఔ.4 నుంచి రూ.5 లక్షల కోట్లతో దేశంలో 374కు పైగా హ్యామ్ ప్రాజెక్టులు కొనసాగు తున్నాయని మంత్రి తెలిపారు.

## లంచం మేసిన కేసులో కార్యదర్శి పట్టివేత

- సహకరించిన సర్పంచ్ భర్త కూడా అరెస్ట్

**సిద్దిపేటమే11( తెలుగురేఖ):**
లంచిం మేసిన మరో ప్రభుత్వ ఉద్యోగని ఎసిబి పట్టుకుంది. బాధితుడి ప్లాట్‌లో నుంచి వెళ్తున్న డైనేజీ పైప్‌లైన్ ను తొలగించేందుకు లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజాగౌడ్ రూ.10 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మధ్యవర్తిగా ఉన్న సర్పంచ్ భర్త గొల్లపల్లి ఆంజనేయులును సైతం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి హైదరాబాద్ కోర్టులో హాజరుపరిచామని ఏసీబీ అధికారులు వివరించారు.

# మోడీ ముందుచూపు... దేని కోసం



**హైదరాబాద్, మే 11 ( తెలుగురేఖ) :** హైదరాబాద్లోని పరేడ్ గ్రౌండ్లో జరిగిన సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా తలెత్తిన ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, దేశ ప్రయోజనాల దృష్ట్యా కరోనా సమయంలో మనం అలవాటు చేసుకున్న పని పద్ధతులను మళ్లీ ఆచరణలోకి తీసుకురావాలని ప్రధాని కోరారు. సాధ్యమైతే చోట ఇంటి నుండే పనిచేసే విధానాన్ని ప్రోత్సహించాలన్నారు. అనవసర ప్రయాణాలను తగ్గించి, ఆన్లైన్ మీటింగ్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ పద్ధతులు పాటించడం వల్ల ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల విదేశీ మారక ద్రవ్యంపై భారం పడుతోందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత వాహనాలకు బదులుగా మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులను ఉపయోగించాలని కోరారు. సొంత వాహనాలు వాడాల్సి వస్తే ఒకే వాహనంలో ఎక్కువ మంది వెళ్లాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. దేశం నుండి విదేశీ కరెన్సీ బయటకు వెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రజలు కొన్ని నియంత్రణలు పాటించాలని ప్రధాని కోరారు. అనవసరమైన విదేశీ పర్యటనలు, ఓవర్సీస్ వెకేషన్లను పక్కన పెట్టాలని, వాటికి బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని కోరారు. విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవడం మానుకుని, భారత్లోనే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడిని తగ్గించడానికి కనీసం ఒక ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. అంతర్జాతీయ విభేదాలు, సరఫరా గొలుసులో అంతరాయాల వల్ల ఏర్పడిన సవాళ్లను భారత్ సమిష్టిగా ఎదుర్కోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం యావత్ దేశాన్ని మళ్లీ లాక్డౌన్ వస్తుందా అనే ఆలోచనలో పడేసింది. అయితే కొందరు నిపుణులు మాత్రం దేశ ఆర్థిక భద్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. పశ్చిమ ఆసియా యుద్ధం వంటి భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు భారీగా పెరిగాయని.. తద్వారా భారత్ తన విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని అందుకే పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించమని కోరినట్టు నిపుణులు చెబుతున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే, మళ్లీ లాక్డౌన్ పరిస్థితులు రాకుండా ఉండాలన్నా, రాబోయే ప్రపంచ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల నుండి సామాన్యులను, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి, ప్రజల్లో క్రమశిక్షణ, పొదుపు అనే ముందస్తు జాగ్రత్తలను అలవాటు చేసేందుకుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది.

# మోదీ చేసిన 'ఎంఎంసీ' వ్యాఖ్యలపై వీహెచ్ ఫైర్

- ముస్లిం లీగ్ - మావోయిస్టు కాంగ్రెస్ అని వ్యాఖ్యానించిన మోదీ
- మోదీ వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశాయన్న వీహెచ్
- మోదీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



**హైదరాబాద్, మే 11 ( తెలుగురేఖ) :** ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'ఎంఎంసీ' (ముస్లిం లీగ్ – మావోయిస్టు కాంగ్రెస్) వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. నిన్న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయగా... నేడు ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) ఘాటుగా స్పందించారు. ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీని మావోయిస్టులతో ముడిపెట్టడాన్ని వీహెచ్ తీవ్రంగా ఖండించారు. హింస కారణంగానే దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలను త్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు. అలాంటి చరిత్ర కలిగిన పార్టీని మావోయిస్టులతో పోల్చడం ఆ మహనీయుల త్యాగాలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను విస్మరించి, వారిని కించపరిచేలా మాట్లాడటం ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తికి తగదని హితవు పలికారు. ప్రధాని వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వీహెచ్ తెలిపారు. మోదీ వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశాయని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ పోలీసులు స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని కూడా హెచ్చరించారు.

# ఇంటర్ అడ్మిషన్లపై గందరగోళానికి తెర.. యథాతథంగా ప్రవేశాలు!



**హైదరాబాద్, మే 11 ( తెలుగురేఖ) :** తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను యథావిధిగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటర్ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటం, అడ్మిషన్లకు సమయం తక్కువగా ఉండటంతో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల విద్య తర్వాత డ్రాపవుట్లను తగ్గించేందుకు, సీబీఎస్ఈ తరహాలో 11, 12 తరగతులను పాఠశాలల్లోనే నిర్వహించాలని విద్యా కమిషన్ ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో ఇంటర్ను పాఠశాల విద్యలో విలీనం చేయాలని ప్రభుత్వం భావించింది. దీంతో ఇటీవల విడుదల చేసిన ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్ను బోర్డు రద్దు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విలీన ప్రక్రియకు సమయం పడుతుందని, అనేక సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. చివరి నిమిషంలో సమస్యల గురించి చెప్పడంపై అధికారుల తీరుపై సీఎం అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేవలం విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఈ ఏడాదికి పాత పద్ధతిలోనే అడ్మిషన్లకు అనుమతిస్తున్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియపై విస్తృతంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఎడ్యుకేషన్ పాలసీ కమిటీని సీఎం ఆదేశించారు. ఆ నివేదికపై శాసనసభలో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఊరట లభించింది. ఈ నిర్ణయం పట్ల ఇంటర్ విద్యా జేఏసీ, ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం హర్షం వ్యక్తం చేశాయి.

# తూర్పు తెలంగాణలో ఉష్ణోగ్రత 47 డిగ్రీలకు చేరే అవకాశం

**హైదరాబాద్, మే 11 ( తెలుగురేఖ) :** రాష్ట్రంలో రెండు రోజులుగా కాస్త చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కనుంది. మంగళవారం నుంచి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని, ముఖ్యంగా ఈ నెల 18 నుంచి 22 మధ్య కాలంలో ఎండలు గరిష్ఠ స్థాయికి చేరతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రత ఏకంగా 47 డిగ్రీల మార్కును తాకే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో 46 డిగ్రీలకు చేరువగా, హైదరాబాద్ నగరంలో సైతం 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. రాబోయే రోజుల్లో పలు జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత పెరగనుందని, ఈ ప్రభావం కనీసం పది రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవచ్చని పేర్కొంది. ఆదివారం నిజామాబాద్ జిల్లా సాలూరలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వడగండ్ల వాన అన్నదాతలను తీవ్రంగా నష్టపరిచింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న రాశులు తడిసిముద్దయ్యాయి. తడిసిన పంటను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపమన్న మోదీ..

- పెళ్లిళ్ల కోసం ఏడాది పాటు బంగారం కొనవద్దని ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా పెరిగిన ముడి చమురు ధరలు
- బంగారం, చమురు దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి
- దిగుమతుల బిల్లు పెరగడంతో డాలర్తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత
- దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకే ప్రభుత్వ వ్యూహాత్మక చర్యలు

**అహ్మదాబాద్ మే 11 ( తెలుగురేఖ) :** "పెళ్లిళ్ల కోసం ఏడాది పాటు బంగారం కొనవద్దు" అంటూ ప్రధాని నరేంద్ర మోదీ భారత ప్రజలకు చేసిన విజ్ఞప్తి, తొలిసారి వినడానికి కొంత అసాధారణంగా అనిపించవచ్చు. సంప్రదాయాలు, పొదుపు, కుటుంబ వేడుకలతో బంగారం అంతగా ముడిపడి ఉన్న దేశంలో ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ పిలుపు వెనుక దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఓ పెద్ద సవాలు దాగి ఉంది. ముఖ్యంగా విదేశీ మారక నిల్వలపై పెరుగుతున్న ఒత్తిడి, ప్రపంచ ఇంధన సంక్షోభం కారణంగా బలహీనపడుతున్న రూపాయి వంటి అంశాలు దీనికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.



### అసలేం జరుగుతోంది?

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గమైన హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కొన్ని వారాల క్రితం బ్యారెల్కు 70 డాలర్లుగా ఉన్న ధర, ఇప్పుడు దాదాపు 126 డాలర్లకు పెరిగింది. ఇది భారతదేశ దిగుమతి బిల్లుపై తీవ్రమైన భారాన్ని మోపుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ.. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ప్రజలకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు.

### బంగారం, చమురుకు ఉన్న ఆర్థిక బంధం

భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ముడి చమురు, బంగారం మధ్య ఒక ముఖ్యమైన సారూప్యత ఉంది. ఈ రెండింటినీ భారత్ పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంటుంది. వీటికి చెల్లింపులు అమెరికన్ డాలర్లలోనే చేయాలి. మన దేశానికి అవసరమైన ముడి చమురులో దాదాపు 85శాతం దిగుమతి చేసుకుంటుండగా, ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం దిగుమతిదారుల్లో భారత్ ఒకటి. ఇలాంటి పరిస్థితుల్లో ముడి చమురు ధరలు పెరిగి, అదే సమయంలో బంగారం దిగుమతులు కూడా అధికంగా ఉన్నప్పుడు, చెల్లింపుల కోసం మనకు భారీ మొత్తంలో డాలర్లు అవసరమవుతాయి. ఇది కరెన్సీ మార్కెట్లో డాలర్కు డిమాండ్ను పెంచి, రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుంది.

### రూపాయిపై ప్రభావం ఎలా ఉంటుంది?

ఆర్థికవేత్తలు బంగారాన్ని సాధారణ వినియోగ వస్తువుగా పరిగణించరు. రవాణా, విద్యుత్, పరిశ్రమలకు చమురు అత్యవసరం. కానీ, బంగారం దిగుమతులను ఎక్కువగా ఐచ్ఛిక వ్యయంగా లేదా పొదుపు సాధనంగా చూస్తారు. ప్రపంచ సంక్షోభ సమయంలో ప్రజలు పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకున్న బంగారాన్ని కొనుగోలు చేస్తే, దేశం నుంచి డాలర్లు అధికంగా బయటకు వెళ్లిపోతాయి. ఇది దేశ దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసాన్ని సూచించే కరెంట్ ఖాతా లోటు (సీఏడీ)ను పెంచుతుంది. లోటు పెరిగినప్పుడు రూపాయి విలువ బలహీనపడుతుంది. రూపాయి పతనం కావడం వల్ల చమురు, బంగారం సహా ఇతర దిగుమతి వస్తువుల ధరలు దేశీయంగా మరింత పెరిగి, ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది.

### ప్రధాని విజ్ఞప్తి వెనుక వ్యూహం

గతంలో కూడా ఇలాంటి ఆర్థిక క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలు బంగారం దిగుమతులను నిరుత్సాహపరిచేందుకు చర్యలు తీసుకున్నాయి. బంగారంపై దిగుమతి సుంకాన్ని పెంచడం, సావరిన్ గోల్డ్ బాండ్ల వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం వంటివి ఇందులో భాగమే. ఒక కుటుంబం బంగారం కొనుగోలును వాయిదా వేసుకుంటే రూపాయి మారకంలో పెద్ద మార్పు ఉండకపోవచ్చు. కానీ, లక్షలాది కుటుంబాల సమిష్టి డిమాండ్ను ఆర్థికవేత్తలు పరిగణనలోకి తీసుకుంటారు. పెళ్లిళ్ల సీజన్లో ఆర్థిక అనిశ్చితి సమయాల్లో భారత్లో బంగారం కొనుగోళ్లు భారీగా పెరుగుతాయి. ప్రస్తుతం చమురు ధరల వల్ల ఇప్పటికే దిగుమతుల బిల్లు పెరిగిన నేపథ్యంలో, బంగారం కొనుగోళ్ల ద్వారా డాలర్లు బయటకు వెళ్లే ప్రమాదాన్ని నివారించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ప్రధాని మోదీ, కేవలం బంగారం కొనుగోళ్లు తగ్గించడమే కాకుండా, వీలైతే వర్క్–ఫ్రమ్–హోమ్ విధానాలను పునరుద్ధరించాలని, అనవసర ప్రయాణాలను తగ్గించుకోవాలని సూచించారు. అంతిమంగా ప్రధాని విజ్ఞప్తి ఉద్దేశం పెళ్లిళ్లు లేదా ఆభరణాల కొనుగోళ్లను నిరుత్సాహపరచడం కాదు. ప్రపంచ ఇంధన సంక్షోభం నుంచి దేశ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటమే దీని వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం.

# ఖండాలు దాటిన ప్రేమ... ఆదిలాబాద్ అబ్బాయిని పెళ్లాడిన లండన్ అమ్మాయి



**ఆదిలాబాద్ మే 11 ( తెలుగురేఖ) :** ప్రేమకు భాష, ప్రాంతం, దేశం వంటి హద్దులు ఉండవని మరోసారి రుజువైంది. ఆదిలాబాద్కు చెందిన యువకుడు, లండన్కు చెందిన యువతి తమ ఐదేళ్ల ప్రేమను పెళ్లి బంధంతో పదిలం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో హిందూ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం వైభవంగా జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని కృష్ణానగర్కు చెందిన భూశెట్టి సాయిచరణ్ పదేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం లండన్కు వెళ్లారు. చదువు పూర్తయ్యాక అక్కడే వ్యాపారంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఆయనకు లండన్లోని కార్డిఫ్కు చెందిన మియామేతో పరిచయం ఏర్పడింది. ఆ స్నేహం కాస్తా ప్రేమగా మారడంతో గత ఐదేళ్లుగా వారు ప్రేమలో ఉన్నారు. తమ ప్రేమ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలిపి వారిని ఒప్పించారు. భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం గత నెలలోనే భారత్కు వచ్చిన ఈ జంట, నిన్న ఆదిలాబాద్లోని ఓ ఫంక్షన్ హాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. భాష, ప్రాంతాలు వేరైనా ప్రేమతో ఒక్కటైన ఈ నూతన జంటను పలువురు అభినందించారు.

## తమిళనాడు మంత్రి కీర్తన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం వాయిదా..



**చెన్నై,మే 11 ( తెలుగురేఖ) :** తమిళనాడు అసెంబ్లీలో ఈరోజు జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్సవంలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వంలో మంత్రిగా ఎంపికైన కీర్తన, సాంకేతిక కారణాల వల్ల ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. సాధారణంగా ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు అసెంబ్లీలో ప్రమాణం చేసే సమయంలో తమ 'ఎలక్షన్ సర్టిఫికెట్'ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. అయితే మంత్రి కీర్తన ఆ ధృవీకరణ పత్రాన్ని వెంట తీసుకురాకపోవడంతో ఆమె ప్రమాణ స్వీకారాన్ని ప్రొటెం స్పీకర్ వాయిదా వేశారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జారీ చేసే ఒరిజినల్ సర్టిఫికెట్ ఉన్న వారిని మాత్రమే ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారానికి అనుమతిస్తారు. అందరూ ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న తరుణంలో, ఒక మంత్రి ఇలాంటి కీలకమైన పత్రాన్ని మర్చిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీంతో ఆమె ప్రమాణ స్వీకారం తాత్కాలికంగా ఆగిపోయింది. అవసరమైన పత్రాలను సమర్పించిన తర్వాత ఆమె మరోసారి ప్రత్యేకంగా ప్రమాణం చేసే అవకాశం ఉంది.

# గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ

**హైదరాబాద్ మే 11 ( తెలుగురేఖ) :** గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి భారీగా బంగారం, వెండి, నగదును అపహరించారు. జైన్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తన బంధువుల పెళ్లికి ఆదివారం ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గుర్తించాడు. ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 30 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు తెలిసింది. వెంటనే గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసారు.

## విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు.. ప్రధాన నిందితురాలు పనిమనిషి కల్పన అరెస్ట్

- దోచుకున్న బంగారాన్ని ముంబైలో దాచినట్లు వెల్లడి



**హైదరాబాద్, మే 11 ( తెలుగురేఖ) :** హైదరాబాద్లో సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య తనూజ రంజన్ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నేపాలీ పనిమనిషి కల్పన అలియాస్ ధర్మ (30)ను మహారాష్ట్రలోని పూణెలో అరెస్టు చేశారు. ఆమెను ప్రత్యేక బృందాలు హైదరాబాద్కు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ కేసును ఛాలెంజ్గా తీసుకున్న పోలీసులు, నిందితుల కోసం పలు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. హైదరాబాద్, పూణె, ముంబై, ఢిల్లీ, బిహార్కు ప్రత్యేక బృందాలను పంపించి, నిందితులు దేశ సరిహద్దులు దాటకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పట్టుబడిన ఇద్దరు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు పూణెలో తలదాచుకున్న కల్పనను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ఈ హత్య వెనుక నేపాల్కు చెందిన సాహూ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు తేలింది. ఢిల్లీ జైలు నుంచే ఈ దోపిడీకి పథకం రచించినట్లు గుర్తించారు. ఈ నేరం కోసం ముంబై, నేపాల్, పాట్నా నుంచి వేర్వేరు వ్యక్తులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్ధారించారు. దోపిడీ చేసిన బంగారాన్ని ముంబైలో దాచిపెట్టినట్లు కూడా పోలీసులు కనిపెట్టారు. కల్పనను హైదరాబాద్కు తీసుకొచ్చి విచారించడం ద్వారా ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## కాకినాడలో కానిస్టేబుల్ దారుణ హత్య

**కాకినాడ, మే 11 ( తెలుగురేఖ) :** కానిస్టేబుల్ దారుణ హత్యకు గురైన ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. గాంధీనగర్లో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో ఏపీఎస్పీ కానిస్టేబుల్ నాగేశ్వరరావు ప్రాణాలు విడిచారు. ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. కానిస్టేబుల్పై మద్యంమత్తులోని యువకులు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న క్లూస్ టీమ్ చేరుకుని విచారణ చేపట్టింది.

# బీబీపేట గ్రామ శివారులో చిరుత సంచారం

- లేగదూడ చంపడంతో రైతుల ఆందోళన

**సంగారెడ్డి, మే 11 ( తెలుగురేఖ) :** సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండలం బీబీపేట గ్రామ శివార్లలో చిరుత పులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో చిరుత కదలికలు ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తాజాగా ఓ రైతు పొలంలో లేగ దూడపై దాడి చేయడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. బీబీపేట గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలం వద్ద పశువులను కట్టేయగా.. అర్ధరాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసింది. ఈ దాడిలో ఒక లేగదూడ మృతి చెందింది. ఉదయం పొలానికి వెళ్లిన రైతు.. లేగ దూడ చనిపోయి ఉండడాన్ని చూసి షాక్కు గురయ్యారు. చిరుత అడుగుజాడలను గమనించిన ఆయన వెంటనే గ్రామస్థులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత సంచారం ఉన్న మాట వాస్తవమేనని ద్రవీకరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. కల్హేర్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో గత కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఏకంగా ఊరికి సమీపంలోని పొలాల్లోకి వచ్చి పశువులను చంపుతుండటంతో, రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాలంటేనే రైతులు వణికిపోతున్నారు.

## టి హబ్ లో కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్షిప్

**హైదరాబాద్ మే 11 ( తెలుగురేఖ) :** తెలంగాణలో విద్యా రంగానికి కొత్త దిశను సూచిస్తూ లక్షకు పైగా విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన కాగ్నిచాంప్ ఇండియా స్కాలర్షిప్–తెలంగాణ 2026 కార్యక్రమం టీహబ్లో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన టాప్ 100 మేధావులు, వారి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, పాఠశాలల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయప్రకాష్ నారాయణతో పాటు కాగ్నిటివ్ స్కోర్ ఏఊఫౌండర్స్ కీర్తి కుమారైజెన్, విక్రమ్సంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఇప్పటికే టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్లో దేశానికి నాయకత్వం వహిస్తోందన్నారు. ఇప్పుడు కాగ్నిటివ్ రెడీనెస్ కూడా ముందుండాలని, ప్రపంచ స్థాయి సంస్థలు భవిష్యత్లో ఉద్యోగులను ఎంపిక చేసేటప్పుడు మార్కుల కంటే సమస్యల పరిష్కారంలో ఎలా ఆలోచిస్తారు, ఎలా పరిష్క రిస్తారు అనే అంశాలను ఎక్కువగా పరిశీలిస్తాయన్నారు.

## సంగారెడ్డిలో 50మంది చిన్నారులకు సైకిల్స్ పంపిణీ చేసిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి మే 11 ( తెలుగురేఖ) :** సంగారెడ్డి పట్టణంలోని 50 మంది చిన్నారులకు సోమవారం జగ్గారెడ్డి సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ వేసవి సెలవుల్లో ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి చిన్నారులకు సూచించారు. ఎండలో సైకిల్స్ తొక్కవద్దన్నారు. తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న చిన్నారులకు విడతల వారీగా సైకిల్స్ పంపిణీ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు 320 సైకిల్స్ పంపిణీ పూర్తయింది. మరో 600సైకిల్స్ పంపిణీ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జార్జ్, చిద్రుప్ప రఘు గౌడ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిని అరెస్టు చేయాలి

**'సిరిసిల్ల మే 11 ( తెలుగురేఖ) :** మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలంటూ సిరిసిల్ల నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు. బీఆర్ఎస్వీ (ఃఖీాం), బీఆర్ఎస్వై (ఃఖీాజ) నాయకులు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గూడూరు ప్రవీణ్, రాష్ట్ర నేత చీటీ నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొని మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాతో పాటు మహిళా కౌన్సిలర్లు తెలంగాణ భవన్లో ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళా కౌన్సిలర్లు కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందజేశారు.

## తొర్రూరు లో రైతుల రాస్తారోకో

**మహబూబాబాద్ మే 11 ( తెలుగురేఖ) :**



మొక్కజొన్నలు తెచ్చి రెండు నెలలు అవుతుంది ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. అకాల వర్షాలకు మొలకలు వస్తున్నాయి. ఏ రాత్రి ఏం జరుగుతుందో అని ఇక్కడే కాపలా ఉండాల్సి వస్తుందని మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేసారు. . అత్తా కోడళ్ళు వెంటనే రావాలి అంటూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.రైతుల రాస్తారోకో తో వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

Printed and Published by RAMANI WEB OFFSET PRINTERS, Published at 8-81/11/1, AUTONAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001, RNI No. TEL-TEL/2010/31853, Editor: Eldi Ravinder, 9-10/7, KRISHN NAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001telugurekha1984@gmail.com, 9963197573.